సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

వరిలో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని సహ పరిశోధన సంచాలకులు రమణ పేర్కొన్నారు. -8లో



రచయితల సభలు చారిత్రక ఘట్టం

జిల్లా రచయితల మహాసభలు చారిత్రక ఘట్టమని వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.6/19.1

జిల్లాలో శనివారం 19.1 - 29.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

కడప అంబేడ్కర్ సర్కిల్‌లో అభిమానుల ఆనందం



కడప కోటిరెడ్డి సర్కిల్‌లో అశేష జనవాహిని



ప్రజలకు సీఎం అభివాదం



కడప గడపకు ముందే పండుగ

- మూడు రోజుల జిల్లా పర్యటనకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- తొలిరోజు బద్వేలు, కడపలో పలు ప్రారంభోత్సవాలతో బిజీబిజీ
- జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా అడుగులు
- ఏడాది ముందే సెంచరీ ప్యానెల్స్ పరిశ్రమ నిర్మాణం పూర్తి
- పేదలకు అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ వైద్యం



బద్వేలు సెంచరీ ప్యానల్స్ పరిశ్రమలో వీడియోను తిలకిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఉద్యోగినికి ఆశీర్వాదం

సాక్షి ప్రతినిధి, కడప : కడప గడపకు కొత్తశోభ వచ్చింది. ఆహ్లాదకర రహదారులు, రమణీయమైన జంక్షన్లు సరికొత్తగా వచ్చి చేరాయి. దశాబ్దాల నుంచి ఎదురుచూస్తూ వచ్చిన సూపర్ స్పెషాలిటీ వైద్యం లోగిట్లోకి వచ్చేసింది. పారిశ్రామిక ప్రగతితో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించాయి. వీటన్నింటికీ మించి జిల్లా ప్రియతమ నేత, అభిమాన నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన జిల్లాలో కనువిందు చేసింది. సీఎం వెళ్తున్న రోడ్డు వెంట బారులు తీరి వేచియున్న ప్రజానీకం జగనన్నను చూడగానే కేరింతలు కొట్టారు. తన కోసం ఎదురుచూస్తున్న ప్రజల్ని చూడగానే ఆయన అభివాదం చేశారు. ప్రతి అభివాదం చేస్తూ మహిళలు, యువత పెద్ద ఎత్తున నినాదాలు చేసి ఆనందాన్ని పంచుకున్నారు. వెరసి జిల్లా వాసులకు ముందే కొత్త సంవత్సర పండుగ వచ్చేసినట్లు అయింది. శనివారం అటు బద్వేలు, ఇటు కడపలో విశేష ప్రారంభోత్సవ కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకధాటిగా కొనసాగిస్తూ బిజీబిజీగా గడిపారు. జిల్లాలను సమగ్రాభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రణాళికా బద్ధంగా కృషి చేసిన ఆయన చేతుల మీదుగా అభివృద్ధి ఫలాలను ప్రజలకు అంకితం చేశారు. పారిశ్రామిక ప్రగతి ఆచరణలో చూపెట్టి యువతకు భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలనే చట్టం తేవడంతో బద్వేలు నియోజకవర్గంలో 2 వేల మందికి పైగా సెంచరీతో ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయి.

నాడు తండ్రి.. నేడు తనయుడు

పూర్వపు కడప జిల్లా.. పాలకుల నిర్లక్ష్యానికి గురై అభివృద్ధిలో వెనుకబడి పోయింది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాడు జిల్లా రూపురేఖలు మార్చేశారు. అభివృద్ధి ఏమిటో రుచి చూపించారు. సమగ్రాభివృద్ధి కోసం విశేషంగా తపించారు. మళ్లీ అలాంటి అభివృద్ధి పనులు.. నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో తెరపైకి వచ్చాయి. రూ.120 కోట్లతో రహదారుల విస్తరణ, బుగ్గవంక రక్షణ గోడ వెంట నూతన రహదారుల ఏర్పాటు, 12 జంక్షన్లను ఆధునికీకరణ చేపట్టారు. కొత్తవారు పర్యటిస్తే కడపలోనే ఉన్నామా అనే భ్రమ కల్గేలా కనులకు విందుగా రమణీయంగా తీర్చిదిద్దారు. రాయలసీమకు తలమానికంగా నిలిచేలా రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రారంభించారు. రూ.272.8 కోట్ల వ్యయంతో అధునాతన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అన్ని హంగులతో కలెక్టరేట్‌ను ఆధునికీకరించారు. కమాండ్ కంట్రోల్ రూం ప్రారంభించారు. విపత్కర పరిస్థితులు సంభవిస్తే రెస్క్యూ ఆపరేషన్ టీమ్‌కు అవసరమైన అధునాతన వసతులు సమకూర్చారు. అభివృద్ధి అంటే ఇలా చేయాలని భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగించారని విశ్లేషకులు కొనియాడుతున్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా గోపవరం, కడప, ఇడుపులపాయ, సింహాద్రిపురం, పులివెందుల పర్యటన సందర్భంగా.. మొదటి రోజు శనివారం జిల్లాకు చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల నుంచి ఘన స్వాగతం లభించింది. కడప విమానాశ్రయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, సి.రామచంద్రయ్య, ఎం. రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప మేయర్ కె.సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాదరెడ్డి, డాక్టర్ సుధీర్ రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీ, రాష్ట్ర పరిశ్రమల సలహాదారు రాజోలి వీరారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఎస్.సుబ్బారెడ్డి, డా.సొహైల్, కలెక్టర్ విజయరామరాజు, రాయలసీమ డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ సిద్దార్థ కౌశల్, కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కడప ఆర్డీఓ మధుసూదన్ తదితరులు స్వాగతం పలికారు. వారు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఆత్మీయ సన్మానం చేశారు.

నేటి పర్యటన వివరాలు

సింహాద్రిపురం/వేంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా ఈనెల 24వ తేదీన ఆదివారం సింహాద్రిపురంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

- ఉదయం 8.15 గంటలకు ఇడుపులపాయ నివాసం నుంచి బయలుదేరి 8.20 గంటలకు వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుంటారు.
- 8.30 గంటల వరకు ఘాట్‌లో జరిగే ప్రార్థనల్లో పాల్గొని నివాళులర్పిస్తారు. అనంతరం ప్రార్థనా మందిరానికి చేరుకుని 11.30 వరకు ప్రార్థనల్లో పాల్గొంటారు.
- మధ్యాహ్నం 12.20 గంటలకు సింహాద్రిపురం జూనియర్ కళాశాల సమీపాన ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.40 గంటల వరకు సింహాద్రిపురం మండల ప్రజాప్రతినిధులతో మాట్లాడుతారు.
- అనంతరం సింహాద్రిపురంలోని రోడ్డు వెడల్పు, సుందరీకరణ, వైఎస్సార్ పార్క్, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.
- 3 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌లో దిగుతారు. ఎకో పార్క్ మీటింగ్ ప్రదేశానికి చేరుకుంటారు. పులివెందుల మండల ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు.
- 4.45 గంటలకు గెస్ట్‌హౌస్‌కు చేరుకుని, ఆ రాత్రి అక్కడే బస చేస్తారు.



బద్వేలు సెంచరీ ప్యానల్స్ పరిశ్రమలో..



కడప ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో..



కడప రిమ్స్‌లోని క్యాన్సర్ ఆస్పత్రి గురించి సీఎంకు వివరిస్తున్న కృష్ణబాబు



కడప అభివృద్ధి పనులపై సీఎంకు వివరిస్తున్న కమిషనర్ సాయిప్రవీణ్‌చంద్

ఇల 'వైకుంఠం' .. భక్తజన సందోహం





ప్రత్యేక అలంకరణలో దేవుని కడప లక్ష్మీవెంకటేశ్వరస్వామి, స్వామి వారి దర్శనం కోసం బారులు దీరిన భక్తులు





ఒంటిమిట్ట కోదండరామాలయంలో స్వామి దర్శనం కోసం ఉత్తర ద్వారంలో భారీగా భక్తజనం

వైకుంఠ ఏకాదశికి ఎంతో విశిష్టత ఉంది. ఈ రోజు ముక్కోటి దేవతలు శ్రీమహావిష్ణువును సేవించుకునేందుకు ఉత్తర ద్వారం దగ్గర వేచి ఉంటారని పురాణాలు చెబుతున్నాయి. అందుకే భక్తులు తాము కూడా స్వామిని దర్శించుకోవాలనే కోరికతో శనివారం తెల్లవారుజాము నుంచే వైష్ణవాలయాలకు భారీగా చేరుకున్నారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో ముఖ్యంగా ఒంటిమిట్ట, దేవుని కడప, పుష్పగిరి, నందలూరు సౌమ్యనాథాలయం భక్తజన సంద్రంగా మారాయి. వారు వైకుంఠం ద్వారం ద్వారా స్వామిని కనులారా చూసి తరించారు.

- సాక్షి, నెట్‌వర్క్

క్లుప్తంగా

నేడు గండిలో హనుమద్ వ్రతం

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఆదివారం హనుమద్ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవల పాటి ముకుందరెడ్డి తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి.. కాపర్ వైరు చోరీ



ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లిన దృశ్యం

కొండాపురం : మండల పరిధిలోని బురుజుపల్లె గ్రామానికి చెందిన అంకిరెడ్డిగారి వెంకట్రామిరెడ్డి తోటలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోఉన్న కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం దినచర్యగా తోట వద్దకు రైతు వెళ్లగా దిమ్మె మీద ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుడు తాళ్లప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

హోటల్‌లో అగ్ని ప్రమాదం



నాగ హోటల్‌లో కాలిపోయిన కీలక పత్రాలు

కురబలకోట : మండలంలోని అంగళ్లు దగ్గర విశ్వం కళాశాల సమీపంలోని పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న నాగ హోటల్‌లో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఇదే హోటల్ ముందు భాగంలో దుకాణం కూడా నిర్వహిస్తున్నారు. రాత్రి హోటల్ మూసి శనివారం ఉదయం వచ్చి చూడగా దుకాణం కాలిపోయి కన్పించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం సంభవించిందని గుర్తించారు. ఈ ప్రమాదంలో హోటల్ యజమాని పి. రవి కుమార్‌కు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు కాలిపోయినట్లు తెలిపారు. భూ డాక్యుమెంట్లు, ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు, గోల్డ్‌లోన్ పత్రాలు, బ్యాంకు పాసుబుక్కులు, ఆధార్ కార్డులతో సహా కాలి బూడిదయ్యాయి. జీవితంలో కష్టపడి సంపాదించిన ఆస్తులకు సంబంధించి అన్ని డాక్యుమెంట్లు కాలిపోయినట్లు బాధితుడు విలపించాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపాడు.

వైఎస్సార్ జిల్లా రచయితల సభలు చారిత్రక ఘట్టం

ప్రారంభోత్సవంలో వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్



జిల్లా మహాసభల్లో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, ఇతర అతిథులు

కడప కల్చరల్ : జిల్లా చరిత్ర, సంస్కృతి, భాష, సంప్రదాయాల వైభవాన్ని చాటుతున్న వైఎస్సార్ జిల్లా రచయితల మహాసభలు అపురూపమైన చారిత్రక ఘట్టంగా భావించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. వైఎస్సార్ జిల్లా రచయితల మహాసభలు శనివారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం నివేదిక సమర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ మన ఘన చరిత్ర, భాష, సాహిత్యాలు, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఈ సభలు ఎంతో ఉపయోగపడగలవన్నారు. సాహిత్యం మనిషిలో చేతన నింపుతుందని, దాని ప్రభావం జీవితంపై ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సభాధ్యక్షులు, సంఘం గౌరవాధ్యక్షులు షేక్ హుసేన్ సత్యాగ్ని మాట్లాడుతూ సాహిత్యం, భాష, సంస్కృతి, కళలు తదితర అన్ని ప్రధాన రంగాలలోనూ ఉన్నత స్థాయికి చేరిన ఎందరో మహానుభావులు జన్మించిన ఈ ప్రాంతం గురించి ఆ మధ్య సినిమాలలో గేలి చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి సభలు నిర్వహించుకోక పోవడంతోనే అలాంటి వాటికి చోటిచ్చినట్లయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం గౌరవ సలహాదారు డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ కథ, నవల, వ్యాసం, విమర్శ, గేయం తదితర సాహిత్య ప్రక్రియల్లో మన జిల్లా ముందు వరుసలో ఉండడం గర్వకారణమన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి కీలకోపన్యాసం చేస్తూ ఈ రంగంలో యువతను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఈ సభల నిర్వహణ అభినందనీయమని, మన జిల్లాకు చెందిన నాచన సోముడే ఆది కవిగా భావించాలని, దీనికి సరైన ప్రచారం లేకపోవడం విచారకరమన్నారు. అభ్యుదయాన్ని కాంక్షించే ఎందరో మహాకవులు, విమర్శ, కథ, నవల రంగాలలో ఔన్నత్యం సాధించిన సాహితీమూర్తులు ఈ నేలపై జన్మించడం గొప్ప విషయమన్నారు. బ్రౌన్‌తోనే ప్రాచీన సాహిత్యం మనకు దక్కిందని, యోగి వేమన విశ్వవిద్యాలయం ద్వారా కథ, నవల తదితర సాహిత్య అంశాలపై ఎన్నదగిన పరిశోధన జరగడం సంతోషదాయకమన్నారు. సంఘం ఉపాధ్యక్షులు గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ జిల్లాకు చెందిన మొల్లమ్మ, తిమ్మక్క తదితర ఎందరో మహిళా మూర్తులు సాహిత్య రంగంలో ముందు వరుసలో నిలిచారని ప్రశంసించారు. గౌరవాధ్యక్షులు అలపర్తి పిచ్చయ్యచౌదరి, డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, డాక్టర్ పి.సంజీవమ్మలు జిల్లా సాహిత్య చరిత్ర ఘనమైనదన్నారు. అధికారభాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ బెత్తాన్ని పక్కన పెట్టడంతో నేటి విద్యార్థులు పక్కదారులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖ కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలు

ఈ సందర్భంగా పలువురు ప్రముఖ రచయితల పుస్తకాలను, సభల ప్రత్యేక సంచికను వేదికపై అతిథులు ఆవిష్కరించారు. అనంతరం మొల్లమాంబ, డాక్టర్ పుట్టపర్తి నారాయణచార్యులు, డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి, డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి పేరిట ఏర్పాటు చేసిన వేదికలపై జిల్లాకు చెందిన పలు అంశాలపై పత్ర సమర్పణలు జరిగాయి.

నవశకం

అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా వేల కోట్లు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక వసతులు కల్పించడంతో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. విద్యార్థులకు విద్యా సామగ్రి, యూనిఫామ్స్, షూస్, టై,బెల్ట్‌లతో పాటు కూర్చోడానికి ఆకర్షణీయమైన బల్లలు ఏర్పాటు చేశారు. అలాగే నాడు–నేడు ద్వారా పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అందంగా తీర్చిదిద్దారు. దీంతో పాఠశాల వాతావరణం పూర్తిగా మారిపోయింది. తద్వారా విద్యార్థుల శాతం పెరిగింది. అలాగే బోధనకు అనుకూలంగా గ్రీన్ బోర్డ్స్, డిజిటల్ బోధనకు వీలుగా ఉపకరణాలు అందించారు. ఇలా చేయడం వలన బోధనతో పాటు విద్యార్థులకు సులభంగా సబ్జెక్ట్ అర్థం అవుతోంది. దీంతో ప్రతి విద్యార్థి చదువులో గతం కంటే ఎక్కువ మార్కులు సాధిస్తున్నాడు. అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాం.

– ఇమాం హుసేన్, స్కూల్ అసిస్టెంట్, బాయ్స్ జెడ్పీ హైస్కూల్, కమలాపురం.

జీవితాంతం రుణపడి ఉంటాం



మాది చెన్నూరు మండలం కొండపేట గ్రామం. 20 ఏళ్ల క్రితం బద్వేలుకు వచ్చి చిన్న పాటి హోటల్ నిర్వహించుకుంటూ అద్దె ఇంట్లో ఉంటున్నాం. హోటల్ నిర్వహణతో వచ్చే ఆదాయంతో ఇంటి అద్దె చెల్లిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాళ్లం. గతంలో ఇంటి కోసం చాలాసార్లు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మా వార్డు వలంటీర్ సుబ్బయ్య ఇంటి వద్దకు వచ్చి మీకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరైందని చెప్పాడు. వల్లెరవారిపల్లె లేఅవుట్‌లో ఇంటి నిర్మాణం పూర్తయింది. త్వరలోనే ఇంటిలో చేరబోతున్నాం. విలువైన స్థలం మాకు ఉచితంగా ఇవ్వడంతో పాటు సొంతింటి కలను నెరవేర్చిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– పి.మాబుచాన్, అశోక్‌నగర్, బద్వేలు

సృజన దీపిక.. ఆవిష్కరణల వేదిక

రాయచోటి టౌన్ : విద్యార్థులు సృజనాత్మకతకు పదును పెట్టారు. సైన్స్‌లో నూతన ఆవిష్కరణలు చేశారు. వాటిని సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించి, ప్రశంసలందుకున్నారు. రాయచోటి పట్టణంలోని అర్చన విద్యా సంస్థలలో శనివారం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల నుంచి విద్యార్థులు నమూనాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రాం పురుషోత్తం హాజరై పరిశీలించారు. వ్యక్తిగత, గ్రూప్ విభాగాలలలో ఉత్తమ ఎగ్జిబిట్‌లు తయారు చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతోపాటు బహుమతులు అందజేశారు. వ్యక్తిగత విభాగాలలో డి.కొత్తకోట మండలం ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలకు చెందిన ఎస్.రోహిత్, కలకడ మండలం ఏపీ ఆర్‌జేసీ బాలికల పాఠశాల విద్యార్థిని పి. లిఖిత, పీలేరు మండలం ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాల జి.అక్షయ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. గ్రూప్ విభాగాలలో తంబళ్లపల్లె మండలం మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు జి.యశ్వంత్, జి.శివ మణి, రాయచోటి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు కేఎండీ ఆనస్, ఎస్.రిహాన్, కురుబలకోట మండలం అంగళ్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనీ్వర్ ఆలీఖాన్, ఉదయ్ నిలిచారు. ఉపాధ్యాయుల విభాగంలో బి.కొత్తకోట బడికాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చంద్రశేఖర్, ఓబులవారిపల్లె మండలం చిన్న ఓరంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివప్రసాద్, నందలూరు మండలం నాగిరెడ్డిగారిపల్లె జెడ్పీఉపాధ్యాయురాలు విజయ కుమారి విశేష ప్రతిభ కనబరిచారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

తిరుపతి పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు

కడప అగ్రికల్చర్ : వరిపంటలో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని తిరుపతి పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ రమణ పేర్కొన్నారు. ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా తిరుపతి ఎస్‌వీ వ్యవసాయ కళాశాల, ఊటుకూరు కేవీకే సంయుక్తంగా విజయవాడ శ్రీ పద్మావతి వేంకటేశ్వర ఫౌండేషన్ వారి సౌజన్యంతో శనివారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో వరిసాగులో సమగ్ర సస్య రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వరిలో సాంప్రదాయ పద్ధతిలో నాట్లు వేసుకోవడం వల్ల కూలీల సంఖ్య పెరిగి సాగు ఖర్చు పెరుగుతుందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా డ్రమ్ సీడర్‌తో వరినాట్లు వేసుకోవడం వలన కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రధాన పరిశోధకురాలు లావణ్య కుమారి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు సహాయంతో అనిశ్చితమైన వాతావరణ పరిస్థితుల్లో వరిపంటలో ఆశించే చీడ పీడలను ముందుగానే పసిగట్టవచ్చన్నారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ వరిలో సరైన యాజమాన్య పద్ధతులను పాటించడంతోపాటు కాలి బాటలను ఏర్పాటు చేసుకుంటే చీడపీడల దాడి తగ్గి అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. ఏరువాక కేంద్ర సమన్వయకర్త మురళీకృష్ణ, వ్యవసాయ పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసాచారి, వ్యవసాయ పరిశోధనస్థానం కీటక శాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త సునీల్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు స్వామి చైతన్య, శిల్పకళ, ప్రశాంతి, సాయి మహేశ్వరి, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త రామలక్ష్మిలతో పాటు రైతులు పాల్గొన్నారు.

యువకుడి ఆచూకీ లభ్యం

– బంధువులకు అప్పగింత



షేక్ బాబా ఫక్రుద్దీన్‌ను బంధువులకు అప్పగిస్తున్న సీఐ, పోలీసు సిబ్బంది

వేంపల్లె : ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అదృశ్యమైన యువకుడిని వేంపల్లె పోలీసులు బంధువులకు అప్పగించారు. వివరాలలోకి వెళితే వేంపల్లె పట్టణం ఇమామ్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ బాషా కుమారుడు షేక్ బాబా ఫక్రుద్దీన్(26) ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీన ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈ మేరకు మే నెల 2వ తేదీన అతని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దీంతో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్‌ల ఆదేశాల మేరకు గాలింపు చర్యలు చేపట్టారు. మహారాష్ట్రలోని పూణే నగరంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి నేరుగా వేంపల్లె పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి షేక్ బాబా ఫక్రుద్దీన్‌ను బంధువులకు అప్పగించారు. బీటెక్ ఫెయిల్ కావడంతో మానసిక ఒత్తిడికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు బంధువులు తెలిపారు. అయితే పోలీసులు చూపిన ప్రత్యేక చొరవతో తమ అబ్బాయి ఇంటికి చేరుకున్నాడని.. సీఐ చాంద్ బాషాతోపాటు పోలీసులకు యువకుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

హార్సిలీహిల్స్‌పై నిలువు దోపిడీ.!



బి.కొత్తకోట : జనవరి ఫస్ట్ వచ్చిందంటే చాలు బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై సందర్శకులు నిలువు దోపిడికి గురవుతున్నారు. ఏటా హార్సిలీహిల్స్‌పై నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకునే పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. దీన్ని అసరాగా చేసుకుని కొండపై అనధికారికంగా నడుస్తున్న ప్రైవేటు అతిథి గృహాల నిర్వాహకులు ఇష్టానుసారంగా అద్దె వసూలు చేస్తూ దోచుకుంటున్నారు. టూరిజం శాఖకు చెందిన అతిథి గృహాలు ఆన్‌లైన్‌లో రూ.1,400 నుంచి రూ.8,008 వరకు అద్దె ఉన్నాయి. అయితే ప్రైవేటు అతిథి గృహాలకు అద్దె ఎంత, అందులో సౌకర్యాలు ఏమిటి అన్నదానిపై పారదర్శకత పూర్తిగా లేదు. దీంతో డిసెంబర్ 31న హార్సిలీహిల్స్‌పై విడిది చేసేందుకు వచ్చే సందర్శకులకు బాడుగల బాదుడు తప్పడం లేదు. గదులు ఖాళీ లేవని చెప్పి కృత్రిమ డిమాండ్ సృష్టించి అధిక అద్దెలు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు అతిథి గృహాల నిర్వాహకుల అక్రమార్జనపై ఆదాయపన్నుశాఖ, జీఎస్టీ, సంబంధితశాఖల అధికారులు ఇంత వరకు దృష్టి పెట్టకపోవడం గమనార్హం.

అనుమతులపై అనుమానాలు

హార్సిలీహిల్స్‌పై ప్రైవేటు అతిథి గృహాల నిర్వహణకు అనుమతులు ఏశాఖ అధికారులు ఇచ్చారో స్పష్టత లేదు. ఒకవేళ అనుమతులుంటే ఎవరి నుంచి పొందారు, అద్దెల ధర ఎంత నిర్ణయించారు, పన్నులు ఎంత చెల్లించారు, నిర్వహణ, సందర్శకుల భద్రతపై ఎవరు ఆమోదం తెలిపారు అన్న అంశాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

కృష్ణా జలాలు పరిశీలించిన లోకాయుక్త

బి.కొత్తకోట : శ్రీ సత్యసాయి జిల్లా నుంచి పుంగనూరు ఉప కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి శనివారం పరిశీలించారు. ప్రవహిస్తున్న నీటిని చూసి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగాల్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత

మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ విఘ్నేశ్వరరావు

పులివెందుల రూరల్ : పులివెందుల మెడికల్ కళాశాల, కడప రిమ్స్ పరిధిలోని క్యాన్సర్ కేర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌కు సంబంధించి కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్న పోస్టుల్లో అనుభవం ఉన్న వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తామని మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ విఘ్నేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డేవిడ్ సెల్వరాజ్‌లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ ఉద్యోగ నియామకంలో అనుభవం, మెరిట్‌కు సీనియారిటీకి మాత్రమే ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎలాంటి సిఫార్సులు చెల్లవన్నారు. దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరి మార్కులను ఆన్‌లైన్‌లో ప్రదర్శిస్తామని తెలిపారు.

రైతు బిడ్డకు ఎస్‌ఐ కొలువు



చెన్నూరు : ప్రతిరోజు వ్యవసాయ కూలి పనులకు వెళుతూ కష్టపడి తమ బిడ్డలను చదివించుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు నెరవేరాయి. చెన్నూరు భవాని నగర్‌కు చెందిన అరవ సిద్ధారెడ్డి ఇటీవల వెలువడిన ఎస్‌ఐ ఫలితాల్లో రాయలసీమ జోన్ పరిధిలో నాలుగో ర్యాంకు, జిల్లా పరిధిలో మొదటి ర్యాంకు సాధించాడు. ఇతను పదో తరగతి వరకు చెన్నూరు ఆర్‌ఆర్ స్కూలులో, ఇంటర్ కడప నారాయణ జూనియర్ కళాశాలలో 2016లో పాసయ్యాడు. కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, ఎమ్మెస్సీ కూడా అదే కళాశాలలో పూర్తి చేశాడు. ఎస్‌ఐ పోస్టు దక్కించుకోవాలన్న లక్ష్యంతో శిక్షణ తీసుకుని 2023 ఎస్‌ఐ ఫలితాల్లో విజయం సాధించాడు. సిద్ధారెడ్డి తల్లిదండ్రులు అరవ సుబ్బరాయుడు, అరవ సీతమ్మలు కాగా, కొన్నేళ్ల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. బంధువుల ప్రోత్సాహంతో ఈ విజయం సాధించానని సిద్ధారెడ్డి తెలిపాడు.

నేడు ఏపీ ప్రైవేటు స్కూల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం



విలేకరులతో మాట్లాడుతున్న ప్రైవేటు స్కూల్స్ జేఏసీ చైర్మన్ లెక్కల జోగిరామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ఎస్వీ శుభం కన్వెన్షన్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు పాఠశాలల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్రస్థాయి విద్యాసదస్సును ఈనెల 23వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రైవేటు స్కూల్స్ జేఏసీ చైర్మన్ లెక్కల జోగిరామిరెడ్డి తెలిపారు. శనివారం కడపలో జేఏసీ కమిటీ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 500 మంది కరస్పాండెంట్లు హాజరవుతారని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

పట్టపగలు మూడు చోట్ల చోరీ

– తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు

పెద్దముడియం : పట్టపగలు తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేశారు. మండలంలోని సీ గొల్లపల్లె, పెద్దముడియం గ్రామాలలోని కుడుములవారిపల్లె, బిక్కావాండ్లపల్లె, రెడ్డివారిపల్లెలో శనివారం జరిగిన వరుస చోరీలతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీలోని కుడుములవారిపల్లెకు చెందిన అలివేలమ్మ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఉదయం ఆటోలో కూలీలతో కలిసి సమీపంలోని పొలాల వద్దకు కూలి పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాగా ఇంటి తాళాలు పగల గొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించింది. ఇంట్లో ఉన్న ఇనుప పెట్టె తాళాలు పగల గొట్టి రూ. 20 వేలు విలువ చేసే నగలు, రూ. 30 వేల నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే పెద్దముడియం పంచాయతీలోని బిక్కావాండ్లపల్లెకు చెందిన ముదిగుబ్బ శ్రీరాములు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇంటికి తాళాలు వేసి, వేరుశనగ పంటలో కలుపు పనుల కోసం వ్యవసాయ బోరు దగ్గరికి వెళ్లాడు. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లిన దొంగలు రూ. 1.80 లక్షలు విలువ చేసే నగలు, రూ. 10 వేల నగదు దోచుకెళ్లారు. అలాగే ఇదే పంచాయతీలోని రెడ్డివారిపల్లెకు చెందిన షేక్ సలీం ఇంట్లో కూడా ఇదే రీతిలో చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న బంగారు, వెండి నగలు, రూ. 19 వేల నగదును దోచుకెళ్లినట్లు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఇషాక్, హెచ్‌సీ శ్యాంప్రకాష్ తెలిపారు.

జిల్లా ఆస్పత్రికి భారతి సిమెంట్ యాజమాన్యం

వాటర్ కూలర్ల వితరణ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి భారతి సిమెంట్ యాజమాన్యం 3 వాటర్ కూలర్లను వితరణ చేశారు. వార్డుల్లో మంచి నీరు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మంచి నీటి కోసం మొదటి, రెండో అంతస్తుల్లోని వార్డుల్లో ఉన్న పేషెంట్లు కిందికి వచ్చి తీసుకెళ్లాల్సి వచ్చేది. ఇటీవల అధికారులు మరో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ప్లాంట్ ద్వారా వార్డుల్లో ఉన్న పేషెంట్లకు మంచి నీరు అందించాలనే ఉద్దేశంతో ఆస్పత్రి అధికారుల విజ్ఞప్తి మేరకు భారతి సిమెంట్ యాజమాన్యం రూ. 3 లక్షలు విలువ చేసే 50 లీటర్ల సామర్థ్యం కలిగిన మూడు వాటర్ కూలర్లను అందజేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి, రెండో అంతస్తుల్లో వీటిని ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం కూలర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్ ప్లాంట్ మేనేజర్ భార్గవరెడ్డి, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. ఆస్పత్రి అధికారులు భారతి సిమెంట్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు

'ఆడుదాం ఆంధ్ర'కు సిద్ధం కావాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్

రాయచోటి టౌన్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి నిర్వహించే ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలకు సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ తెలిపారు. శనివారం రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించి ర్యాలీని అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల నిండిన వారందరికీ భాగస్వామ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలు గ్రామ సచివాలయ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి చివరిగా రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, డీఈవో శ్రీరాం పురుషోత్తం, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. ఇదే అంశంపై సంబంధిత శాఖల అధికారులతో జేసీ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

రాయచోటి : జాతీయ వినియోగదారుల దినోత్సవం -2023 పురస్కరించుకొని రాయచోటి కలెక్టరేట్ స్పందన హాల్‌లో ఈ–కామర్స్, డిజిటల్ వర్తకం శకంలో వినియోగదారుల రక్షణ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారి రఘురాం, జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వి.రమేష్‌కుమార్‌రెడ్డి, డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త వినియోగదారుల రక్షణ చట్టం–2019పై అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు నగదు ప్రోత్సాహకం, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పి.శివరాం మూర్తి, డీఎంహెచ్ఓ డాక్టర్ కె.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తికి గాయాలు

మదనపల్లె : వెల్డింగ్‌షాపులో పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి గాయపడిన సంఘటన శనివారం బసినికొండలో జరిగింది. పట్టణంలోని మోతీనగర్‌కు చెందిన సయ్యద్‌బాషా కుమారుడు సమీర్(28) బసినికొండ వద్ద ఉన్న ఆదిల్ వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. శనివారం ఓ ట్రాక్టర్ రిపేరి నిమిత్తం రాగా, నిలిపి ఉంచిన ట్రాక్టర్‌కు మరమ్మతులు చేస్తున్నారు. అదేసమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ముందుకు కదులుతూ, సమీర్ కాలుపైకి ఎక్కింది. ప్రమాదంలో సమీర్ గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు.